అవ్వాతాతల ఆశీర్వాదమే జగన్‌కు శ్రీరామరక్ష

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ప్రొద్దుటూరు : లబ్ధిదారులకు పింఛన్ అందిస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : అవ్వాతాతల ఆశీర్వాదమే ముఖ్యమంత్రి జగన్‌కు శ్రీరామ రక్ష అని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డులకు సంబంధించి గురువారం ఉదయం మున్సిపల్ కార్యాలయ ఆవరణలో, సాయంత్రం అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో వైఎస్సార్ పెన్షన్ కానుక సభలు నిర్వహించారు. కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద రెడ్డి మాట్లాడుతూ చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం దశల వారిగా మీకు ఇచ్చే పింఛన్‌ను పెంచడం జరిగిందన్నారు. చాలా మంది బిడ్డలకు దూరమై, బతుకుభారమైన వృద్ధుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. అత్యంత సాధారణ కుటుంబం నుంచి వచ్చిన తనకు పేదరికం గురించి పూర్తి తెలుసునన్నారు. అందరూ మూడు పూటలా భోజనం తినాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు మంజూరు చేస్తోందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ కోసం వృద్ధులు ఎన్నో అవస్థలు పడేవారన్నారు. జన్మభూమి కమిటీల రెకమెండేషన్ ఉంటేనే పింఛన్ వచ్చేదని, ఎదిరింటి వారో, పక్కింటి వారో మరణిస్తే కానీ కొత్త పింఛన్ మంజూరయ్యేది కాదని అన్నారు. మంజూరైన ఆ పింఛన్ తీసుకునేందుకు గుడికో, బడికో వెళ్లి ఎదురుచూడాల్సి వచ్చేదన్నారు. వేలి ముద్రలు పడక వృద్ధులు వెనక్కి రావడం, కొన్ని చోట్ల అస్వస్థతకు గురై చనిపోయిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి వలంటీర్ల ద్వారా మన ఇంటికే వచ్చి పింఛన్ ఇచ్చేలా ఏర్పాటు చేశారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి, టీడీపీకి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ప్రజలు గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జరిగేది కురుక్షేత్ర యుద్ధం కాదని, అబద్ధానికి, సత్యానికి మధ్య మాత్రమేనన్నారు. చంద్రబాబు చెప్పే అబద్ధాలను ప్రజలు విశ్వసించరన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, కమిషనర్ వెంకటరమణయ్య, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు కామిశెట్టి బాబు, కౌన్సిలర్లు నూకా నాగేంద్రరెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, ఎద్దుల జయంతి, కోఆప్షన్ సభ్యుడు మల్లికార్జున ప్రసాద్, 3వ వార్డు ఇన్‌చార్జి కృష్ణార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెక్కుల పంపిణీ

ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలో మంజూరైన రూ.5.84 లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గురువారం మున్సిపల్ కార్యాలయంలో పంపిణీ చేశారు. షేక్ రహమతున్నీసాకు రూ.3లక్షలు, తాటి మధుసూదన్ రెడ్డికి రూ.2లక్షలు, పాలూరు రామసుబ్బారెడ్డికి రూ.60వేలు, గోపిరెడ్డి శ్రీకాంత్ రెడ్డికి రూ.24వేలు మంజూరు అయిందని ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, హిదాయత్, వైఎస్సార్‌సీపీ రాజుపాళెం మండల అధ్యక్షుడు గుద్దేటి రాజారాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాబుకే భరోసాలేదు.. ప్రజలకు ఏమిస్తాడు

- పింఛన్ పెంచి విశ్వసనీయతను నిరూపించుకున్న సీఎం జగన్
- వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఎదుర్కొనే ధైర్యం టీడీపీకి లేదు
- పెరిగిన పింఛన్ పంపిణీలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి


లబ్ధిదారులకు పింఛన్ ఇస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : చంద్రబాబుకే భరోసా లేక ఇతర పార్టీల మద్దతు కోసం పాకులాడుతున్నారు.. ఇక ప్రజలకేం భరోసా ఇస్తారని ఎమ్మెల్యే రఘురామిరెడ్డి ఎద్దేవా చేశారు. ఖాజీపేట మండలం ముత్తులూరుపాడు, ఖాజీపేట టౌన్ టీచర్స్ కాలనీలో ఇంటింటికి వెళ్లి ఎమ్మెల్యే పెన్షన్లను అందజేశారు. పెన్షన్ పెంపుపై లబ్ధిదారుల అభిప్రాయాన్ని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన మాటకు కట్టుబడి పింఛన్ మొత్తాన్ని పెంచిన వైఎస్ జగన్ తన విశ్వసనీయతను మరోసారి నిరూపించుకున్నారన్నారు. పింఛన్ నగదు పంపిణీ లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూశామన్నారు. ప్రతి పింఛన్‌దారు మళ్లీ జగన్‌ను ముఖ్యమంత్రి అయ్యేలా ఆశీర్వదించాలన్నారు. ఖాజీపేట మండలంలో 6378 మందికి పెన్షన్లు ఇస్తున్నాం. 23న డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలో భాగంగా వారి ఖాతాలకు నగదు జమ చేయబోతున్నామన్నారు. ప్రతి ఇంటికి పథకాలను అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌కు ప్రజలు అండగా నిలవాలని కోరారు.

చంద్రబాబు హామీలను ప్రజలు నమ్మరు

ప్రతిపక్షనేత చంద్రబాబు అధికారంలోకి రావడానికి అమలు చేయలేని హామీలను ఇస్తారన్నారు. అధికారంలోకి రాగానే నేనెప్పుడు చెప్పాను అంటూ ఎదురు ప్రశ్న వేస్తారని తెలియజేశారు. 2024 ఎన్నికల్లో బాబు ఇచ్చే హామీలకు గ్యారెంటీ, వారెంటీలు ఉండవని వాపోయారు. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి ఎలా రావాలో తెలిసిన నేత చంద్రబాబేనన్నారు. అర్హులకు పథకాలను ఇస్తూ ప్రజారంజక పాలనను సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ధైర్యం చంద్రబాబుకు లేక ఇతర పార్టీలతో పొత్తుల కోసం వెంపర్లాడుతున్నారన్నారు. కార్యక్రమంలో మైదుకూరు నియోజకవర్గ సమన్వయ కర్త శెట్టిపల్లి నాగిరెడ్డి, ఏపీఐఐసీ డైరెక్టర్ గంగాధర్‌రెడ్డి, ఎంపీపీ అబూబకర్ సిద్ధిక్, కోఆప్షన్ సభ్యుడు అచ్చుకట్ల కరీముల్లా, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మండల కో–ఆప్షన్ సభ్యుడు మున్వర్, సర్పంచ్‌లు పెద్దిరెడ్డి, చంద్రశేఖర్, పల్లె ఏసురత్నం మాజీ సర్పంచ్‌లు గురివిరెడ్డితోపాటు మండల నాయకులు పాల్గొన్నారు.

అవ్వాతాతలకు అండగా
వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

ఎమ్మెల్యే డాక్టర్ సుధ


బి.కోడూరులో పెన్షన్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవ్వాతాతలకు అండగా ఉంటూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు పెన్షన్‌ను విడతల వారీగా రూ.3 వేలకు పెంచి అవ్వాతాతల మనస్సులో చిరస్థాయిగా నిలిచిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ, వైఎస్సార్‌సీపీ యువ నాయకులు డి.ఆదిత్యరెడ్డిలు తెలిపారు. బి.కోడూరులోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వైఎస్సార్ పెన్షన్ కానుక కార్యక్రమాన్ని ఎంపీడీఓ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తి చేసిన ఏకైక వ్యక్తి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు. ప్రతి కుటుంబం జగనన్న ప్రభుత్వం లబ్ధి చేకూర్చిందని నమ్మితేనే తిరిగి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఓట్లు వేయాలని వృద్ధులను కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిత్యారెడ్డి, జెడ్పీటీసీ దావీదు, ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, చాపాటి నారాయణరెడ్డి, పిచ్చిరెడ్డి, వెంకటరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాశినాయనలో..

కాశినాయన : అవ్వాతాతల సంక్షేమం కోసం పాదయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి రూ.3 వేలు తమ ఇంటి వద్దకే పంపిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ అన్నారు. గురువారం నరసాపురంలోని మండల పరిషత్ ఆవరణలో వైఎస్సార్ పెన్షన్‌ను ఆమె 175 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువ నాయకులు ఆదిత్యరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ హనుమంతరెడ్డి, ఎంపీడీఓ మైథిలి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్టీయూ డైరీ ఆవిష్కరణ


డైరీని ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, ఉపాధ్యాయులు


డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

మైదుకూరు : స్థానిక మండల విద్యాశాధికారి కార్యాలయం వద్ద గురువారం సాయంత్రం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) డైరీని ఎంఈఓలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి గోశెట్టి రామ్మోహన్, అసోసియేట్ అధ్యక్షుడు జీఆర్ మల్లేశ్వర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బీకే సురేష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ మీర్ సాహెబ్, రీజనల్ కన్వీనర్ వెంకటేశ్వర రాజు, మండల అధ్యక్ష, కార్యదర్శులు రమణయ్య, చెన్నకేశవ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ

చాపాడు : ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఉపయోగపడేలా ఏపీటీఎఫ్ డైరీ, క్యాలెండర్లను రూపొందించారని ఎంఈఓ రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక మండల రీసోర్స్ కార్యాలయం వద్ద గురువారం ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాం సుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీకృష్ణ, ఏపీటీఎఫ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి


జగనన్న ఇళ్లను పరిశీలిస్తున్న ప్రత్యేక అధికారి వెంకటరెడ్డి

మైదుకూరు : మున్సిపాలిటీలోని ముక్కొండ వద్ద నిర్మిస్తున్న జగనన్న ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని హౌసింగ్ జిల్లా ప్రత్యేక అధికారి, ఎస్‌ఈ కె.వెంకటరెడ్డి అన్నారు. మెగా కంప్లిషన్ డ్రైవింగ్‌లో భాగంగా గురువారం ఆయన ముక్కొండ జగనన్న కాలనీని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నిర్మాణాలను పూర్తి చేసుకున్న ఇళ్లను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. మూడో ఆప్షన్ కింద జరుగుతున్న ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఆయన వెంట జిల్లా హౌసింగ్ అధికారి ఎం.కృష్ణయ్య, మైదుకూరు డీఈఈ పాండురంగారెడ్డి, సిబ్బంది ఉన్నారు.

జగనన్న కాలనీ పరిశీలన

ప్రొద్దుటూరు : నవరత్నాలు – పేదలందరికి ఇళ్ల పథకం ద్వారా స్థానిక బొల్లవరం జగనన్న కాలనీలో నిర్మిస్తున్న ఇళ్లను విజయవాడ నుంచి వచ్చిన స్పెషల్ ఆఫీసర్ ఎస్‌ఈ కె.వెంకటరెడ్డి గురువారం పరిశీలించారు. లబ్ధిదారులు ఎంచుకున్న 3వ ఆప్షన్ ద్వారా కాంట్రాక్టర్లు నిర్మిస్తున్న ఇళ్లను ఆయన పరిశీలించారు. సచివాలయ ఇంజనీర్లకు ఆయన సూచనలు ఇచ్చారు. జియో ట్యాగ్ చేసిన ప్రగతిని దశల వారిగా ఆన్‌లైన్ ద్వారా ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా హౌసింగ్ పీడీ ఎస్.కృష్ణయ్య, ఈఈ రాజారత్నం, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలోని కృష్ణమందిరంలో ధనుర్మాసం సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం ఉదయం శ్రీకృష్ణునికి పంచామృతాభిషేకం చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు సౌజన్యంతో రోజూ సాయంత్రం నంద్యాల రాధ తిరుప్పావై పాశురాలను పఠిస్తున్నారు. ఈ నెల 14 వరకు రోజు మందిరంలో ప్రత్యేక పూజలు ఉంటాయని దేవాదాయశాఖ ఏసీ శంకర బాలాజీ కోరారు.

6న భూమి పూజ


భూమి పూజ ఏర్పాట్లను పరిశీలిస్తున్న పోరెడ్డి నరసింహారెడ్డి తదితరులు

రాజుపాళెం : రాజుపాళెం మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో శ్రీసంజీవరాయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి ఈనెల 6వ తేదీన ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి భూమి పూజ చేయనున్నట్లు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. మండల ఇన్‌చార్జి ఎంపీపీ వెలవలి నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కానాల బలరామిరెడ్డి, మండల నాయకులతో కలసి పోరెడ్డి ఆలయంలో ఏర్పాట్లను గురువారం పరిశీలించారు. ముందుగా వారు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి ఈ ఆలయ పునర్నిర్మాణానికి మొత్తం రూ.18 కోట్లు మంజూరు చేయించగా.. మొదటి విడతగా రూ.3.55 కోట్లు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ గుద్దేటి రాజారాంరెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగశేషారెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్ రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ వెలవలి శేఖర్ రెడ్డి, గోపాయపల్లె సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి, యువ నాయకుడు గౌతమ్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అనఘాష్టమి


ప్రత్యేక అలంకరణలో దత్తాత్రేయస్వామి, అనఘాదేవి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శివాలయం వీధిలోని శ్రీ విశ్వంభర దత్తాత్రేయస్వామి ఆలయంలో గురువారం అనఘాష్టమి సందర్భంగా ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వేకువజామున దత్తాత్రేయస్వామి మూలవిరాట్‌కు విశేష అభిషేకాలు, అర్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం దత్తాత్రేయస్వామి, అనఘాదేవిల ఉత్సవ మూర్తులకు విశేష పూజలు చేసి కల్యాణోత్సవాన్ని వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య జరిపారు. కార్యక్రమానంతరం భక్తులకు అన్న ప్రసాద వినియోగం జరిగింది. సాయంత్రం అనఘాదేవి వ్రతాన్ని మహిళలు సామూహికంగా ఆచరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి, అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాల స్వీకరించారు.

అక్షింతలు పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక మేదరవీధి, శంకరరావువీధి, శ్రీరాములపేటలో గురువారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను 13వ వార్డు ఇన్‌చార్జ్ నరేష్‌కుమార్, ప్రొద్దుటూరు రైల్వే స్టేషన్ కన్సల్టేటివ్ మెంబర్ సీవీ జయలక్ష్మి పంపిణీ చేశారు. వార్డులోని అన్ని ఇళ్లు తిరుగుతూ అందరికీ అక్షింతలను, స్వామివారి చిత్రాన్ని అందించారు. ఈ నెల 22న అయోధ్య శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని లైవ్‌లో వీక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రేపు భరత కళా వసంతం

ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయ కళ్యాణ మండపంలో నృత్య తరంగిణి కళా నిలయం ఆధ్వర్యంలో శని, ఆది, సోమవారాల్లో భరత కళా వసంతం పేరుతో వర్క్‌షాప్‌ను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు టి.శ్రవణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కూచిపూడి నాట్యంలో విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా కేంద్రసంగీత నాటక అకాడమి అవార్డు గ్రహీతలు కళాపీఠం ప్రిన్సిపాల్ డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రీ, డాక్టర్ వసంత్ కిరణ్ హాజరవుతారన్నారు.

క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే రాక

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠానికి శుక్రవారం ఉదయం 8 గంటలకు మైదుకూరు ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి వస్తున్నట్లు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నూతనంగా పెంచిన పింఛన్‌ను వృద్ధులకు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

నేడు వైఎస్సార్ పెన్షన్ పంపిణీ

అట్లూరు : మండల పరిధిలోని స్థానిక స్త్రీశక్తి భవనంలో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్ పెన్షన్‌ను పంపిణీ చేస్తారని ఎంపీడీఓ సుజాతమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొంటారని మండల ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు హాజరు కావాలన్నారు.

నేడు విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం

పోరుమామిళ్ల : పంచాయతీ పరిధిలోని రామాయపల్లెలో రూ.2.50 కోట్లతో నిర్మించిన 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ శుక్రవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్సీ డీసీ గోవింద రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు ప్రారంభిస్తారని వైఎస్సార్‌సీపీ కార్యాలయం తెలిపింది. అనంతరం మండల కాంప్లెక్స్‌లో ప్రాథమిక సహకార పరపతి సంఘ కార్యాలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తారన్నారు. ఆ తరువాత బి.కోడూరు మండల కేంద్రంలో 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను, రూ.45 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తారన్నారు.

నేడు మడూరులో వైద్య శిబిరం

చాపాడు : మండలంలోని మడూరు గ్రామంలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు వైద్యాధికారి రాజేష్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ అన్ని రకాలైన వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేస్తామన్నారు. అవకాశాన్ని ప్రజలకు సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారి కోరారు.

కొనసాగిన సమ్మె


మాట్లాడుతున్న శ్యాంసుందర్‌రెడ్డి

చాపాడు : అంగన్‌వాడీల సమ్మె 24వరోజు కూడా కొనసాగింది. స్థానిక మండల రెవెన్యూ కార్యాలయం వద్ద గురువారం చేపట్టిన అంగన్వాడీ వర్కర్ల నిరసనకు ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్యాంసుందర్‌రెడ్డి మద్దతు తెలిపారు. అంగన్‌వాడీల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

ప్రొద్దుటూరు : స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద గురువారం ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో కార్మికులు పొర్లుదండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు విజయ్ కుమార్, పట్టణ గౌరవాధ్యక్షుడు సత్యనారాయణ మాట్లాడుతూ తమ డిమాండ్లను పరిష్కరించేంత వరకు సమ్మె ఆగదని తెలిపారు. ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నజీర్ ఈ సమ్మెకు మద్దతు తెలిపారు. యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి సాల్మాన్, పట్టణాధ్యక్షుడు చంటి, కోశాధికారి రాఘవ, సహాయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించుకోండి

పోరుమామిళ్ల : విద్యుత్ సమస్యలను విచారించి వినియోగదారులకు న్యాయం చేసేందుకే ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని ట్రాన్స్‌కో ఈఈ, ఏడీఈలు తెలిపారు. గురువారం పోరుమామిళ్ల కరెంట్ ఆఫీసు వద్ద నిర్వహించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్‌లో రిటైర్డు న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు రామమోహన్‌రావు, అంజనీకుమార్, ఈశ్వరమ్మ పాల్గొన్నారు. పరిష్కారం కాని విద్యుత్ సమస్యలు వినియోగదారులు చెప్పుకోవాలని అధికారులు కోరారు. అదాలత్‌లో పోరుమామిళ్ల, బి.కోడూరు, కాశినాయన, కలసపాడు మండలాల నుండి వినియోగదారులు పాల్గొని సమస్యలు చెప్పుకున్నారు. ప్రధానంగా రైతులు ట్రాన్స్‌ఫార్మర్ కొరకు దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా మంజూరు చేయలేదని, కొత్తవి బిగించలేదని చెప్పుకున్నారు. రైతుల సమస్యలపై కోర్టులో త్వరలో పరిష్కారం, న్యాయం చేసేందుకు అధికారులు అంగీకరించారు. సమావేశంలో ఈఈ, ఏడీఈలతో పాటు సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, నాలుగు

పాలాభిషేకం


సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

ప్రొద్దుటూరు కల్చరల్ : జనవరి నెల నుంచి పింఛన్ రూ.3 వేలకు పెంచినందుకు మండల పరిధిలోని కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలో గురువారం సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ పెంచిన పింఛన్ వల్ల లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. పంచాయతీ పరిధిలోని 61 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లను అందచేశారు. కార్యక్రమంలో 13వ వార్డు మెంబర్ కొనిరెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తులను పరిరక్షించాలి

ప్రొద్దుటూరు : స్థానిక పుట్టపర్తి సర్కిల్‌లో ఇన్సాఫ్ ఆధ్వర్యంలో గురువారం వక్ఫ్‌బోర్డు ఆస్తులను పరిరక్షించాలని నిరసన వ్యక్తం చేశారు. ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్ మాట్లాడుతూ వక్ఫ్ ఆస్తులను కాపాడాలని ఎన్నో మార్లు అధికారులకు, పాలకులకు ఫిర్యాదు చేశామన్నారు. 2019–20లో వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ కోసం ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేసిందన్నారు. వక్ఫ్ బోర్డు భూమిని కొంత మంది ఆక్రమించుకుని తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో పంచాయతీ కార్యాలయాల నుండి అనుమతులు తీసుకుని ఇళ్లను నిర్మించుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో ఇన్సాఫ్ సమితి సభ్యులు బాబ, మాలిక్, జబీవుల్లా, కరీముల్లా, షేక్షా, షబ్బీర్, రాజ్ కుమార్, మునయ్య తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం


సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

బి.కోడూరు : లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని డిప్యూటీ డెమో రమణమ్మ తెలిపారు. గురువారం మండలంలోని బి.కోడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారులు వినీత్‌కుమార్‌రాజు, ఉదయ్‌కిరణ్‌ల అధ్యక్షతన పీసీపీఎన్‌డీటీ చట్టం గురించి ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆడపిల్లలను బ్రతకనిద్దాం, ఆడపిల్లలను ఎదగనిద్దాం అని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ కుమారి, మానిటరింగ్ కన్సల్టెంట్ పాలేశ్వరరావులు మాట్లాడుతూ లింగ నిర్ధారణ నిర్వహించిన వారికి మొదటిసారి 3 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా, రెండవసారి నిర్వహిస్తే 5 సంవత్సరాలు జైలుశిక్ష, రూ.50 వేలు జరిమానా విధిస్తారని తెలిపారు. సమావేశంలో హెల్త్ సూపర్‌వైజర్లు జాన్‌విలియం, విజయలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేతనాలు పెంచండి

మైదుకూరు : ఆశ వర్కర్ల వేతనాలను పెంచాలని కోరుతూ గురువారం స్థానిక అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఆశ కర్యకర్తలు ఆందోళన నిర్వహించారు. ఆశాలను గుర్తించి వారికి వేతనాలు పెంచడంతోపాటు వారికి రాజకీయ ఇబ్బందులు లేకుండా చూడటమే కాక పనిభారం తగ్గించి ఇతర డిమాండ్లను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.శ్రీరాములు, ఆశ వర్కర్స్ యూనియన్ నాయకురాలు పీవీ రమణమ్మ, సుజాత డిమాండ్ చేశారు.

ఘనంగా కుంభాభిషేక మహోత్సవాలు


పూజాకార్యక్రమాలను నిర్వహిస్తున్న వేదపండితులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక రామేశ్వరం రెండు కొళాయిల సమీపంలోని శ్రీసంజీవరాయస్వామి నూతన శిఖర వరసిద్ది వినాయక సహిత భవానీశంకర స్వామి విగ్రహ ప్రతిష్ఠ, మహాకుంభాభిషేక మహోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతిపూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, దీక్షా హోమం, జలాధివాసం తదితర పూజాకార్యక్రమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా జరిగాయి. కాగా శుక్రవారం దేవతా మూర్తుల విగ్రహాలకు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, గణపతి, రుద్రహోమం, మధ్యాహ్నం 2గంటలకు విగ్రహాల గ్రామోత్సవం, సాయంత్రం ధాన్యాధి, శయ్యాధి, పుష్పాధివాసం తదితర పూజాకార్యక్రమాలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ వాటర్ వర్క్స్ సిబ్బంది తెలిపారు.

మహిళా టీంల ఎంపికపై నగదు బహుమతి


ఆడుదాం ఆంధ్రాపై పీడీలతో సమీక్షిస్తున్న ఎంపీడీఓ సాయినాయక్

గోపవరం : ఆడుదాం ఆంధ్రాకు సంబంధించి మహిళా టీంలు ఎంపిక చేసిన సచివాలయ కార్యదర్శులకు నగదు బహుమతిని అందజేయనున్నట్లు ఎంపీడీఓ సాయినాయక్ తెలిపారు. గురువారం మండల అభివృద్ధి కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల పీడీలతో ఎంపీడీఓ సమీక్ష నిర్వహించారు. ఆడుదాం ఆంధ్రాకు ఎక్కువగా పురుషుల టీంలు రావడం జరుగుతుందని, మహిళలను ప్రోత్సహించి వారిని కూడా అన్ని క్రీడల్లో భాగస్వాములను చేయాలనే ఉద్దేశ్యంతోనే పంచాయతీ కార్యదర్శులను ప్రోత్సహించేందుకు ఈ నగదు బహుమతిని పెట్టడం జరిగిందన్నారు. మండలంలోని ఆరు సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, బాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు సంబంధించి ఒక్కొక్క సచివాలయానికి 5 టీంలను ఎంపిక చేయాలన్నారు. క్రీడల పట్ల ఆసక్తి ఉన్నా కొంత మంది మహిళలు వెనకడుగు వేస్తున్నారని, వారిలో ఉన్న నైపుణ్యాన్ని వెలికి తీసేందుకే ఈ మహిళా టీంలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందుకోసం ఆయా సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు మహిళా టీంల ఎంపికలో ఆసక్తి కనబరచాలన్నారు. కేవలం కార్యదర్శులను ప్రోత్సహించేందుకే నగదు బహుమతిని ఇవ్వడం జరుగుతుందని, ఇందులో ఎంత నగదు అనేది ప్రధానం కాదనేది ప్రధాన ఉద్దేశ్యమన్నారు. ప్రతి సచివాలయంలో 5 టీంలు ఎంపిక చేసిన కార్యదర్శులకు రూ.12 వేలు నగదు బహుమతిని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం నుండే కార్యదర్శులు మహిళా టీంల ఎంపికలో భాగస్వాములు కావాలని కోరారు.